క్లుప్తంగా

అమ్మవారికి శ్రీచక్రాభిషేకం

పెద్దతిప్పసముద్రం : శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి శ్రీ చక్రానికి అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాన్ని చూపరులను ఆకట్టుకునేలా నిర్వహించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మదనపల్లె సిటీ : శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో లలితాంబిక అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో లలితాత్రిపురసుందరిదేవికి పూజలు చేశారు. స్థానిక కోర్టు ఆవరణంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మహిళలు నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

దాతల సాయం అభినందనీయం

పీలేరు : దాతల సాయం అభినందనీయమని ఎంఈవో పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం, దుబ్బహరిజనవాడ, శివరామపురం ప్రాథమిక పాఠశాలల్లో ఏబీసీ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు సుమలత, వారి తండ్రి డీసీసీ బ్యాంకు అప్రైజర్ రాజేంద్రాచారి విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో గత పది సంవత్సరాలు రాజేంద్రచారి కుటుంబం పేద విద్యార్థులకు చేయూతనిస్తున్నారని అభినందించారు. హెచ్ఎం రేణుక, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆర్థికలావాదేవీలపై ఆడిట్

తంబళ్లపల్లె : మండలంలోని స్వయం సహాయక సంఘాలు, మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య సభ్యులు పుస్తకాలు సక్రమంగా నిర్వహించినప్పుడే లెక్కలు పారదర్శకంగా ఉంటాయని ఏపీఎం గంగాధర్ తెలిపారు. శుక్రవారం స్త్రీ శక్తిభవనంలో ఆడిటర్లు గిరికుమార్, విజయకాంత్‌లు 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండల సమాఖ్య , ఎఫ్‌బిఓ, 30 గ్రామసమాఖ్యలకు చెందిన ఆర్థికలావాదేవీలపై ఆడిట్ నిర్వహించారు. పొదుపులు, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు,చెల్లింపులు తదితర అంశాలపై ఆడిట్ జరిగింది. కార్యక్రమంలో డిఎంజీ మల్లయ్య, సీసీలు,సంఘమిత్రలు,విఓ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ మాన్యం భూములు కాపాడాలని వినతి

తంబళ్లపల్లె : మండలంలోని జంజురపెంట పంచాయతీ నేరేడుకొండలో వెలసిన నేరేడు కొండరాయుడు ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని శుక్రవారం జంజురుపెంట, ఆర్ఎస్ తాండా, కొటాల పంచాయతీల్లోని భక్తులు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. నేరేడుకొండ ఆలయం దేవదాయశాఖలో గుర్తింపు పొందినట్లు తెలిపారు. ఈ ఆలయానికి జంజురుపెంట, ములకలచెరువు మండలం కాలువపల్లె రెవెన్యూ గ్రామ పంచాయతీల్లో మాన్యం భూములు ఉన్నాయన్నారు. ప్రతి ఏడాది ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మాన్యం భూములు కొందరు అక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయ భూములు కాపాడాలని కోరారు.

కనీస సౌకర్యాలు కల్పించడం బాధ్యత

కలకడ : బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం ఉపాధ్యాయుల బాధ్యత అని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ గరడప్పగారిపల్లెలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం, విద్యార్థులకు రుచికరమైన భోజనం అందుతోందా అని ఆరాతీశారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. టీచింగ్ స్టాఫ్ కాంట్రాక్ట్ పద్ధతిలో ఎక్కువమంది ఉండటంతో ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. టీచింగ గదిలోనే డార్మెటి నిర్వహించడంపై అసంతృప్తి చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన షూ (బూట్లు) 80 మందికి రీప్లేస్ చేయాలని పంపగా నేటి వరకూ అందలేదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నందిని, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

– డీఎల్పీఓ నాగరాజు

రామసముద్రం : వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని డీఎల్పీఓ నాగరాజు, ఎంపీడీఓ గఫూర్ అన్నారు. శుక్రవారం వారు చెంబకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రోగుల ఓపీ రికార్డులను పరిశీలించారు. రోగుల సౌకర్యాలను అడిగితెలుసుకున్నారు. ఓపి పెంచేలా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యంపై నమ్మకం కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు, అవగాహనలు కల్పించాలన్నారు. అలాగే ఎలకపల్లిలోని డంపింగ్ యార్డును పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం దిన్నిపల్లి సమీపంలోని కేజీబీవీ బాలికల పాఠశాలను ఎంపీడీఓ, తహసీల్దార్ అజారుద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

చంద్రబాబు మోసాలను ఎండగట్టాలి

- అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం
- జగన్ అంటే బాబుకు భయం
- రెడ్ బుక్ పాలనతో వైఎస్సార్ సీపీ నాయకులను వేధింపులు
- పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు
- మాజీ ఎమ్మెల్సీ, వైయస్సార్ సీపీ సమన్వయకర్త, నేతలు




సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు, బాబు షూరిటీ -మోసం గ్యారంటీ స్కాన్ పత్రికలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజాప్రతినిధులు

నిమ్మనపల్లె : అబద్దాలు, మోసపూరిత హామీలతో 2024 ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ చంద్రబాబు ప్రజలను చీటింగ్ చేసి అధికారంలోకి వచ్చారని, కూటమి ప్రభుత్వ మోసాలను వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు ఉమ్మడిగా క్షేత్రస్థాయికి వెళ్లి ఎండగట్టాలని, నియోజకవర్గ పార్టీ ముఖ్య నేతలు అన్నారు. శుక్రవారం నిమ్మన పల్లెలోని టిఎస్ఆర్ కళ్యాణ మండపంలో రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో లో భాగంగా, బాబు షూరిటీ –మోసం గ్యారంటీ కార్యక్రమం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

సంక్షేమానికి చిరునామా వైఎస్సార్

మాజీ ఎమ్మెల్సీ, అనంతపురం పార్లమెంటు పరిశీలకులు బి.నరేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమానికి చిరునామా మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డిని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆయన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్ రెడ్డి అంతకుమించి పేద ప్రజలకు అండగా నిలిచి అనేక సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందించారన్నారు. అయినా గత ఎన్నికలలో ప్రజలు బాబు అబద్ధపు హామీలను నమ్మి ఓట్లు వేశారన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలు అమలు చేయలేక అసమర్థతను చాటుకుందన్నారు. ఒక్క సంక్షేమ పథకమైన తాము తెచ్చామని చంద్రబాబు చెప్పుకోగలరా అంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో యాప్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు యాప్ డౌన్లోడ్ చేసుకుని గ్రామస్థాయిలో పర్యటించి చంద్రబాబు ఇచ్చిన అబద్ధపు హామీలు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను సమన్వయంతో ఉమ్మడిగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతి ఎన్నికల్లోను చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటూ చెబుతూనే, పేదలకు మొండి చేయి చూపి, సంపన్నులను అభివృద్ధి చేస్తున్నారన్నారు. పేదల పక్షాన నిలిచి పేదలకు సాయం చేసిన ఏకైక వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. మోసాన్ని జయించాలంటే ప్రజలను చైతన్యవంతులు చేయడమే ఏకైక మార్గం అన్నారు. ఈసారి కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు.

రెడ్ బుక్ పేరుతో తప్పుడు కేసులు

నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నిసార్ అహ్మద్ మాట్లాడుతూ... ప్రజా క్షేత్రంలో పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎదుర్కోలేని చంద్రబాబు రెడ్ బుక్ పాలనలో తప్పుడు కేసులతో వారిని వేధిస్తున్నారన్నారు. ప్రజల్లో వారికున్న ఆదరణను జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం ఎలాగైనా వారిని దోషులుగా చిత్రీకరించాలని ప్రయత్నిస్తోందన్నారు. తామంతా వారికి అండగా ఉంటామన్నారు. తప్పుడు కేసులకు భయపడేది లేదని హెచ్చరించారు.మోసాలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. ప్రజల్లో పశ్చాత్తాప భావన ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా ప్రణాళిక బద్ధంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద ఎత్తున క్షేత్రస్థాయికి వెళ్లేందుకు కార్యాచరణ రూపొందించుకుని ప్రతి గ్రామానికి వెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను కళ్ళకు కట్టినట్లు వివరించి, ప్రజలంతా వైఎస్ఆర్సిపి వైపు చూసేలా పనిచేయాలన్నారు. మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటే కార్యకర్తలకు ఆయన పెద్దపీట వేస్తారన్నారు. జగన్ 2.0 లో కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యమని ఇప్పటికే జగన్మోహన్ రెడ్డి ప్రకటించారన్నారు. ఆయన మాట ఇస్తే ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

జగన్ అంటే భయం

రాజంపేట పరిశీలకులు ఎన్. ఆనీషారెడ్డి, పార్టీ నాయకులు ఎన్.శ్రీ నాథరెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి అంటే భయం పట్టుకుందన్నారు. మామిడి రైతుల పరామర్శకు బంగారుపాళ్యం వచ్చినప్పుడు, రైతులకు గిట్టుబాటు ధర కోసం గుంటూరు మిర్చి యార్డుకు వెళ్ళినప్పుడు, పొగాకు రైతుల కోసం అండగా నిలబడినప్పుడు, కరెంటు చార్జీలు పెంచితే ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పుడు... ప్రజల్లో జగన్మోహన్ రెడ్డికి వచ్చిన ఆదరణ చూసి చంద్రబాబుకు గుండెల్లో గుబులు పుడుతుందన్నారు. ఇప్పుడు ఎన్నికలొస్తే వైఎస్సార్ సీపీ 136 స్థానాల్లో గెలుస్తుందని సర్వేలు ప్రకటించడంతో, చంద్రబాబు మరింతగా భయపడుతున్నారన్నారు. కొన్ని పత్రికలు పాత్రికేయ విలువలు సైతం మరిచి జగన్మోహన్ రెడ్డిని దూషించడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఉన్నత స్థాయి అధికారులను సైతం వేధిస్తూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అంటూ ప్రజలను సూపర్ గా చంద్రబాబు చీటింగ్ చేశారన్నారు. వైఎస్సార్ సీపీ కేడర్ మొత్తం వర్గ విభేదాలు లేకుండా సమన్వయంతో కలిసి పని చేసే వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పత్రికలను కార్యకర్తలతో కలిసి నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు వైస్ ఎంపీపీ జయప్రకాష్ రెడ్డి,సీనియర్ నాయకులు గార బురుజు రమణారెడ్డి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు రెడ్డి శేఖర్ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి హేమంత్ కుమార్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రేవతి, సర్పంచులు మహదేవరెడ్డి, చెంద్రాయుడు, ఉషారాణి, ఎంపీటీసీ రెడ్డి వెంకటేష్, నాయకులు యుగంధర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి రామ్మోహన్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, నవాజ్ హుస్సేన్, రెడ్డి భాస్కర, రామారావు, నూర్ మొహిద్దీన్ ఖాన్, రెడ్డి శివకృష్ణ, రవితేజ దాము సుధాకర, హోటల్ రఫీ, రాజన్న, రమణ,ఖాదర్ బాషా, రుకియా బేగం, అమ్మాజాన్, మేరీ, నాగమణి పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలి



నిరసన వ్యక్తం వైఎస్సార్‌సీపీ నాయకులు

పీలేరు రూరల్ : సంబంధంలేని అక్రమ లిక్కర్ కేసుతో అరెస్టు చేసిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి లోకనాథరెడి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి భువనేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిక్కర్ కేసులో ఎలాంటి సంబంధం లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అక్రమ అరెస్టులు పనిగా పెట్టుకుని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పెద్దిరెడ్డి కుటుంబం చిత్తూరు జిల్లాలోనే వైఎస్సార్‌సీపీలో బలమైందని తెలిపారు. ఎలాగైనా పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షసాధింపు తీర్చుకోవడానికి ఇలాంటి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఎంపీ కడిగిన ముత్యంలా బయటకొస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌నాయుడు, వెంకటప్పనాయుడు, అశోక్, సద్దాం, సైషా, రమేష్, కిరణ్, వికాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటానికి మద్దతు ఇవ్వండి

ములకలచెరువు : ప్రజా సంక్షేమం కోసం సీపీఐ పార్టీ చేసే పోరాటాలని ప్రజల నుంచి మద్దతు కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. శుక్రవారం స్థానిక మండల కేంద్రంలో 6వ మండల బహిరంగ మహాసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని మిగులు భూములు, ప్రభుత్వ భూములను పేదలకు పంచాలన్నారు. భూములు పంచాలని భూ పోరాటాలు చేస్తున్న సీపీఐ నాయకులపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధించడంపై ప్రజలు నిరసించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అన్నదాతలకు పథకాలు అందించడంలేదని, కరువు సహాయక చర్యలు చేపట్టలేదని, దళితులపై జరుగుతున్న దాడులకు సీపీఐ చేసే పోరాటాల్లో ప్రజలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బషీర్‌ఖాన్, మనోహర్‌రెడ్డి, కృష్ణప్ప, సాంబశివ, అంజప్ప తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

ప్రత్యేక ప్రార్థనల్లో నిసార్ అహ్మద్

నిమ్మనపల్లె : శుక్రవారం పవిత్రతకు, ముస్లింల మత ప్రార్థనలకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చి పండుగ రోజు ఏ విధంగా ప్రార్థనలకు హాజరవుతారో అదేవిధంగా చేయడం ప్రతి ముస్లిం విధానమని వైఎస్సార్ సీపీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లెలోని జామియా మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పటిష్టతకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి, రెడ్డి భాస్కర, హేమంత్ కుమార్, సుధాకర, హోటల్ రఫీ, దావూద్ ఖాన్, మౌలా, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్రఫీ, సర్పంచ్ నవాజ్, రుకియా, అస్లాం, బాసిత్ ఖాన్, అష్రఫ్ ఖాన్, నూర్ మొహిద్దీన్, తాజ్ బాషా, ఖిజార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలకు వెళుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్

సంచార జాతులకు వయస్సు నిర్ధారణ పరీక్షలు

మదనపల్లె రూరల్ : సంచార జాతులకు సంబంధించిన పలు కుటుంబాల వ్యక్తులకు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్యులు, వయస్సు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెలో సుమారు 50 కుటుంబాలు సంచార జీవనం చేస్తూ 15 ఏళ్ల పాటు అక్కడే ఉన్నారు. ఐదేళ్ల క్రితం వారు ఉపాధిలో భాగంగా కురబలకోట మండలం తుమ్మచెట్లపల్లెకు చేరుకుని అక్కడే నివసిస్తున్నారు. అయితే, ఆ కుటుంబాలకు సంబంధించిన వ్యక్తులకు ఆధార్, రేషన్‌కార్డుతో పాటు ఇతర ధృవపత్రాలు ఏవీ లేకపోవడంతో వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందేవి కావు. ప్రభుత్వ గణాంకాల్లో వీరి వివరాలు నమోదు కాలేదు. సమస్యను గుర్తించిన స్థానిక వార్డు మెంబర్ నాగరత్నమ్మ వారిని మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి తీసుకువచ్చింది. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేసింది. స్పందించిన ఆయన వారికి ఆధార్, రేషన్, ఇతర ధృవపత్రాలు అందించేందుకు జిల్లా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయాల్సిందిగా వైద్యులను ఆదేశించారు. దీంతో శుక్రవారం మారెప్ప, బోయకొండప్ప, శంకరమ్మ, ప్రసాద్, పవన్, యల్లప్ప కుటుంబాలకు చెందిన వ్యక్తులు జిల్లా ఆస్పత్రికి చేరుకుని వయస్సు నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు.



జిల్లా ఆస్పత్రిలో వైద్య నిర్ధారణ పరీక్షల కోసం వచ్చిన సంచార జాతుల కుటుంబాలు

బంగారు కుటుంబాలను గుర్తించండి

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె రూరల్ : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో పెద్దసంఖ్యలో గ్రామసభలు నిర్వహించి పీ4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలు, మార్గదర్శులను గుర్తించాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌కు, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ...ప్రభుత్వ నిబంధనల మేరకు బంగారు కుటుంబాలను, మార్గదర్శులను గుర్తించాలన్నారు. బంగారు కుటుంబాలు ఎన్ని ఉన్నాయి? ఎన్ని అర్హత లేనివి ఉన్నాయో గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బంగారు కుటుంబాల నమోదు, తొలగింపులను జాగ్రత్తగా చేయాలని సూచించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ...పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న బంగారు కుటుంబం-మార్గదర్శి(పీ4) పథకాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఆగస్టు 15 నాటికి ఎంపిక చేసిన లబ్ధిదారులను మార్గదర్శులు దత్తత తీసుకునేలా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలి

ఏఓ నవీన్‌కుమార్ రెడ్డి

మదనపల్లె రూరల్ : భవిష్యత్ తరాలకు సారవంతమైన నేల, నాణ్యమైన ఆహారం, కాలుష్యం లేని వాతావరణం అందించాలంటే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులంతా మొగ్గు చూపేలా, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు కృషి చేయాలని మండల ఏఓ నవీన్‌కుమార్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ సహకారంతో కమ్యూనిటీ ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌డ్ నేచురల్ ఫార్మింగ్‌పై రైతుసేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే) ఇన్‌చార్జ్‌లకు నిర్వహిస్తున్న మూడురోజుల శిక్షణా కార్యక్రమంలో రెండోరోజైన శుక్రవారం మండలంలోని అంకిశెట్టిపల్లెలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఏఓ నవీన్‌కుమార్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై వివరించారు. భూమిపైన జీవ వైవిధ్యం, భూమిలోపల రకరకాల వేరు వ్యవస్థల ద్వారా అనేక రకాల సూక్ష్మజీవులు ఉత్పన్నమవుతాయని, తద్వారా మొక్కకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయని తెలిపారు. తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయ సాగులో నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రకృతి సాగులో ఘన, ద్రవ, జీవామృతం, కషాయాలు వాడటం వల్ల పంటలో నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. సహజవనరులను కాపాడుకుంటూ, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకుంటూ, రైతులకు సుస్థిర వ్యవసాయ దిగుబడులను అందించేందుకు ప్రకృతి వ్యవసాయం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కురబలకోట, రామసముద్రం, నిమ్మనపల్లె ఏఓలు అజిత, జాఫర్, మంజుల, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ విధానాలపై వివరిస్తున్న ఏఓ నవీన్‌కుమార్ రెడ్డి

డబుల్‌రోడ్డుపై పాలకులకు చిత్తశుద్ధి లేదా..?

- హంద్రీనీవాను బాహుదాకు అనుసంధానం చేయాలి
- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కే.మురళి

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె–మదనపల్లె డబుల్ రోడ్డు నిర్మాణం, బాహుదా ప్రాజెక్ట్‌కు హంద్రీ నీవా జలాల అనుసంధానంపై పాలకులకు చిత్తశుద్ధి లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కే.మురళి అన్నారు. శుక్రవారం సీపీఐ నిమ్మనపల్లి మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా కే.మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి నుంచి నిమ్మనపల్లి రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారిందని,ఈ రోడ్డుపైన రోజువారి తిరిగే ప్రయాణికులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారిన ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదని,పాలకులకు నిమ్మనపల్లి రోడ్డు ఎన్నికల ఎజెండాగా మాత్రమే కనిపిస్తోందన్నారు. హంద్రీనీవా నీరుని బహుదాకు అనుసంధానం చేయాలని, ఈ ప్రాంతంలో ఉన్న చెరువులు హంద్రీనీవా నీటితో నింపి రైతులకు సాగునీరు అందించాలన్నారు. ఎన్నికల సందర్భంగా నాయకులు ఈ ప్రాంతానికి అనేక హామీలు ఇస్తారని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను గాలికి వదిలేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మదనపల్లి నుంచి నిమ్మనపల్లి వెళ్లే రోడ్డును డబల్ రోడ్డు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు మాధవ్, రెడ్డి శేఖర్,మండల నాయకులు నరేష్,శ్రీరాములు, సలీం భాష తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కే.మురళి

నవోదయ విద్యార్థినికి కృత్రిమ చేయి ఏర్పాటు

మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరురోడ్డులోని వలసపల్లెవద్దనున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 12వ తరగతి చదువుతున్న విద్యార్థిని శివానికి కడప రిమ్స్‌లో కృత్రిమ చేయిని ఏర్పాటు చేశారు. శివాని పుట్టుకతోనే కుడి చెయ్యి లేకుండా పుట్టింది. ఆమె తన పనులు చేసుకోవడానికి కష్టమతుంది. ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ ఎం.గీత జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సిఫార్సుతో రిమ్స్ ఉప సంచాలకులు ఆర్.వి.కృష్ణ కిషోర్, ఆర్ఎంఓ శ్రీకాంత్ పర్యవేక్షణలో ఆర్థోపెడిక్ డాక్టర్ జగదీష్ కృత్రిమ చేయిని అమర్చారు. ప్రిన్సిపాల్ గీత, అధ్యాపకులు కలెక్టర్, రిమ్స్ వైద్యులకు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు.



మాజీ సింగిల్ విండో అధ్యక్షుడి మృతికి నివాళి



రామస్వామిరెడ్డి (ఫైల్)

కురబలకోట : వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, కురబలకోట మండల మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, మట్లివారిపల్లెకి చెందిన ఎస్. రామస్వామిరెడ్డి (85) శుక్రవారం మృతి చెందాడు. వారం రోజులుగా ఇతను అస్వస్థతకు గురయ్యారు. విండో అధ్యక్షుడిగా రైతులకు విశిష్ట సేవలు అందించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డితో పాటు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పలువురు నివాళి అర్పించారు. ఇతని కుమారుడు ఎస్‌వి. రమణారెడ్డి మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్ సీపీలో కీలక నాయకుడిగా కొనసాగుతున్నారు.

ప్రత్యేక కోర్టు పీపీగా అమరనారాయణ



అమరనారాయణ

బి.కొత్తకోట : తిరుపతిలోని ఎర్ర చందనం కేసుల ప్రత్యేక కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బి.కొత్తకోట మండలం గట్టుకు చెందిన న్యాయవాది అమరనారాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఆయన మూడేళ్లపాటు పీపీగా ఉంటారు. ఆయన 30 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. మదనపల్లెలో సుదీర్ఘకాలం పని చేశారు.

యువ కాపునాడు అధ్యక్షుడిగా గొర్రె రమణ



కురబలకోట : యువ కాపునాడు తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్షుడిగా కమతంపల్లెకు చెందిన గొర్రె రమణ శుక్రవారం నియమితులయ్యారు. రాజంపేట పార్లమెంటరీ కాపునాడు అధ్యక్షులు శెట్టి సీతారాం ఆధ్వర్యంలో బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. కాపునాడు పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

శంభుప్రసాద్‌కు ప్రతిభా పురస్కారం

మదనపల్లె సిటీ : ప్రజా చైతన్యస్రవంతి అందజేసే ప్రతిభా పురస్కారం ఈ ఏడాది గుంటూరుకు చెందిన ప్రముఖ సినీ సంగీత దర్శకులు శంభుప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రజా చైతన్యస్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు తెలిపారు. ప్రతి ఏడాది భరతముని ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు రొమ్మాల మునికృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఈనెల 27వతేదీ పురస్కారం అందజేస్తామన్నారు. కళాభిమానులు, సాహితీప్రియులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

వెలుగు సేవ సంస్థకు సేవా ధార్మిక్ అవార్డు

మదనపల్లె సిటీ : సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక పాఠశాల, ఆశ్రమం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్న వెలుగు సేవ సంస్థకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక సేవా ధార్మిక్ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన లతారాజా ఫౌండేషన్ అవార్డు ఎంపికైనట్లు సమాచారం పంపారు. సమాజంలో ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి ఏటా అవార్డులు అందజేశారు. ఈ అవార్డును ఈనెల 26వతేదీ వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రం నందు జరిగే కార్యక్రమంలో అవార్డును అందజేస్తారు. అవార్డు ఎంపిక పట్ల వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సేవా ప్రయాణానికి లభించిన గుర్తింపున్నారు.మరింత సేవా విస్తరణతో ముందుకు సాగుతామన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ఉత్సవ మూర్తులను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం) : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. తిరుపతి శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారిని గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యేని ఆశీర్వదించారు. అనంతరం ఆలయం వెలుపల జరుగుతున్న ఉత్సవాలలో పాల్గొని ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి నేతలకు మంచి బుద్ధి ప్రసాదించాలని, అక్రమ అరెస్టులు, కేసులు, దౌర్జన్యాలు మానుకుని ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్ల దృష్టి సారించాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి ఆయన వెంట పాల్గొన్నారు.

మకరతోరణం వితరణ

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయానికి దాత, భక్తురాలు మకరతోరణం వితరణగా ఇచ్చారు. దాత లక్ష్మీదేవమ్మ రూ.95,100 విలువ చేసే 13.5 కేజీల బరువు కలిగిన మకర తోరణాన్ని శుక్రవారం ఆలయ ఇన్స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, నగేష్, అర్చకులు రమేష్‌లకు అప్పగించారు. ఆమె దాతృత్వాన్ని భక్తులు ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం

రామసముద్రం : మండల సీపీఐ కార్యదర్శి గా బి. మోహన్ రెడ్డి ఎన్నికయ్యారు. రామసముద్రంలో శుక్రవారం కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కే. మురళి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.